## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మే 23: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి కాచిగూడ విద్యానగర్, చిక్కడపల్లి, ఆర్టీసీ ఎక్స్ రోడ్, అహోబిలం మఠం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం (నేడు)విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కాచిగూడ ఎక్స్ రోడ్, చిక్కడపల్లి, విద్యానగర్ ఫీడర్ల పరిధిలోని బర్కత్‌పుర బస్సు డిపో, రత్ననగర్, బీజేపీ ఆఫీస్, కాచిగూడ జూనియర్ కాలేజ్, రాంనగర్ గుండు, అడిక్‌మెట్, విద్యానగర్, చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, బాగ్‌లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఆర్టీసీ ఎక్స్ రోడ్, అహోబిల మఠం ఫీడర్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, హరినగర్, అచ్చయ్యనగర్, ఏటీఐ, ఆంధ్రా బ్యాంక్, లైఫ్ హాస్పిటల్, సాయిబాబా టెంపుల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

## ఇంటర్ గురుకులాలు ఎత్తివేత నిర్ణయం తగదు

చిక్కడపల్లి, మే 23: రాష్ట్రంలో సాంఘీక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలు ఎత్తివేయాలనే నిర్ణయం తక్షణమే వెనక్కి తీసుకొవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండీ జావీద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకులాలు ద్వారా వేలాది మంది పేద విద్యార్థులకు ఇంటర్ విద్య అందుతోందని అన్నారు. కార్పోరేట్, ప్రవేట్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో ఈ గురుకులాలు విద్యార్థులకు ఆసరాగా ఉన్నాయని అన్నారు. ఇటువంటి కాలేజీలను మూసివేయడం ద్వారా పేద విద్యార్థులకు చదువు దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని గురుకులాలను కొనసాగించాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# పరిసరాలు.. దుర్గంధ భరితం

- ఎంజీ రోడ్డులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వ్యర్థాల పారబోత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


మహాత్మా గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వెనుక భాగంలో పేరుకుపోయిన వ్యర్థాలు

బేగంపేట్, మే 23: సికింద్రాబాద్ మహాత్మాగాంధీ రోడ్డు. నగరంలో అత్యంత ప్రాముఖ్యత గల రహదారి. ఇదే రోడ్డులో గాంధీ విగ్రహం ఉంది. ప్యారడైజ్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు, ఎంజీబీఎస్ నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగించే రహదారి. పేరుకుపోయిన వ్యర్థాలతో చెత్త డంపింగ్ యార్డును తలపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతోపాటు విగ్రహం చుట్టూ ఆహ్లాదకరమూన వాతావరణాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వెలుపలి ప్రాంతంలో ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి నిత్యం పరిశుభ్రతను నిర్వహించేవారు.

### వ్యర్థాలకు నెలవుగా..

ప్రస్తుతం విగ్రహం ఏర్పాటు చేసిన వెలుపలి (వెనుక) ప్రాంగణం అంతా వ్యర్థాలను నెలవుగా మారింది. దీంతో నిత్యం దుర్గంధ భరితంగా మారి ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. అంతేగాకుండా ఫుట్‌పాత్ మొత్తం కబ్జాలకు గురైంది. ఆటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్వహణ లోపం కారణంగా పరిసరాలన్ని వ్యర్థాలతో నిండిపోయాయి. గాంధీ విగ్రహం వెనక భాగం ఖాళీ స్థలం కొంత మేరకు కార్లు పార్కింగ్ చేస్తుంటారు. కొంత మంది అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసి ఫుట్‌పాత్ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల నూతనంగా వచ్చిన మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డబ్బాలను తొలగించి ఫెన్సింగ్ వద్ద చెత్త డబ్బాలను పడేశారు. దీంతో ఆ ప్రాంతం మరుగు మయంగా మారింది. దీంతో అక్కడ జీహెచ్ఎంసీ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసీ శానిటేషన్, మహంకాళి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు. వ్యర్థాలను తొలగించి ఫుట్‌పాత్ ఏర్పాటు చేస్తే వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వినియోగదారులకు, ప్రజలకు, అక్కడి వ్యాపారులకు ఎంతో సౌకర్యవంతంగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా అక్కడా ట్రాఫిక్ సమస్యను కూడా అధిమించే అవకాశాలు ఉన్నాయి. అధికారులు సందర్శించ అక్కడి పరిసరాలను ప్రజా అవసరాలకు అనుగుణంగా మారేలా చూడాలని అక్కడి వ్యాపారులు కోరుతున్నారు.

### పరసరాలను శుభ్రం చేస్తాం: వెంకటేష్, డీఈ

అక్కడి పరిసరాలను పరిశీలించాం. అక్కడ అండర్ కేబుల్ వైర్లు బయట పడటం వల్ల అక్కడ ఫుట్‌పాత్ పనులను నిలిపివేశాం. ప్రస్తుతం ఆ వైర్ల పని కూడా విద్యుత్ శాఖ అధికారులు సరిచేశారు. త్వరలోనే అక్కడి పరిసరాలను ప్రజలకు ఉపయోగంగా మార్చేందుకు కృషి చేస్తాం. చుట్టూ ఫుట్‌పాత్‌ను కూడా నిర్మిస్తాం.

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు


బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ, మే 23: కవాడిగూడ ఎల్బీనగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని లాల్‌బహదూర్ శాస్త్రినగర్(ఎల్బీనగర్)లోని డబుల్ సముదాయాన్ని శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువనాయకుడు ముఠా జయసింహతో కలిసి సందర్శించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, డబుల్‌బెడ్‌రూమ్ సముదాయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. అదే విధంగా తమకు ఇళ్లు రాలేదని ఎలాగైనా ఇప్పించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌బీనగర్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు.




## కక్ష సాధింపు కోసమే నోటీసులు


ముఠా జయసింహ

చిక్కడపల్లి, మే 23: ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌పై రాజకీయంగా కక్ష సాధించడానికే కాంగ్రెస్ సర్కార్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా నోటీసులు ఇచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఈ విధంగా కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం గొప్పతనం గురించి దేశ అత్యున్నత న్యాయస్థానం చెప్పినా ప్రస్తుత ప్రభుత్వానికి అర్థకం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణ సాగు ముఖ చిత్రం మారిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో ఈ ప్రభుత్వాన్నికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

# నిర్మాణ ముసాయిదాలో మార్పులు

## - కంటోన్మెంట్ బోర్డు పాలకమండలిలో నిర్ణయం

బొల్లారం, మే 23: కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశం శుక్రవారం బ్రిగేడియర్ నంజూదేశ్వర అధ్యక్షతన జరిగింది. బోర్డు సీఈవో మధుకర్ నాయక్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ పరిధిలో జరిగే అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించాలని పాలకమండలి తీర్మానం చేసింది. కంటోన్మెంట్ పరిధిలో గ్రౌండ్ ప్లస్ టు అంతస్తులకు మాత్రమే అనుమతిస్తారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన భవన నిర్మాణాల ముసాయిదాలో మరోసారి అధికారులు మార్పు చేశారు. జీహెచ్ఎంసీలో ఉన్నటువంటి నిబంధనల మాదిరిగానే బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఎఫ్ఎస్ఐ పరిమితి పెంపు చేయాలన్న ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నిబంధనలపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి నూతన భవన నిర్మాణాల ముసాయిదా రూపొందించాలని కేంద్ర రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఈ సందర్భంగా ఆదేశించారు.

### దోబీఘాట్‌లోని ప్లేగ్రౌండ్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి

దోబీఘాట్‌లోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని బోర్డు పాలక మండలి నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు గతంలో ప్రకటించింది. ఇందుకు కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆమోదం తెలిపారు. కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ తమ ఆధ్వర్యంలో ఉంటుందని బ్రిగేడియర్ నంజదేశ్వర్, సీఈవో మధుకర్ నాయక్ స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహణ బాధ్యత ఉండాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. అంతేగాకుండా పలు అంశాలపై వాడీవేడిగా చర్చలు జరిగాయి.

## తలసీమియా నివారణే లక్ష్యం


తలసీమియా వ్యాధి నివారణకు ఫెర్నాండెజ్ దవాఖాన ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్న తలసీమియా సికిల్‌సెల్ సొసైటీ సభ్యులు

బండ్లగూడ,మే 23: సమాజంలో తలసీమియా వ్యాధి నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని తలసీమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్సీఎస్)పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ జి.పద్మ పేర్కొన్నారు. శుక్రవారం టీఎస్సీఎస్ సంస్థ వారు గర్భధారణలో తలసీమియా వ్యాధిని గుర్తుంచి దాని నివారణకు చర్యలు తీసుకునేందుకు ఫెర్నాడెంజ్ ఆస్పత్రి వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. 2035 సంవత్సరం వరకు భారత దేశంలో తలసీమియా వ్యాధి గ్రస్తులు లేకుండా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ వ్యాధిని యాంటినాటల్ స్క్రీనింగ్ ద్వారా గర్భం దాల్చిన మొదటి మూడు నెలలో గుర్తించవచ్చని తెలిపారు.ఇలాంటి పరీక్షలు చేసేందుకు తలసీమియా సికిల్ సొసైటీ ఫెర్నాడెంజ్ దవాఖానతో కలిసి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

## చిన్నప్పటి నుంచి విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి


డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్‌ను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మైలార్‌దేవ్‌పల్లి, మే 23: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో మౌలిక నైపుణ్యాలు, అనుకూల వాతావరణం కల్పించడం ఇలాంటి కార్యక్రమాలు కీలకమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యమంగా చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడం వల్ల భవిష్యత్తులో నైపుణ్యం గల విద్యార్థులుగా ఎదగగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనీత, నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ పద్మజ, ఎస్.అశోక్, సునీల్, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, లక్ష్మి, మాధవి, రత్న, గౌరీ, ప్రేమదేవి, ఆశ వర్కర్లు మంగ, మణెమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణపై మరింత దృష్టి పెట్టాలి

బంజారాహిల్స్, మే 23: వర్షాకాలం ప్రారంభం కానుండడంతో దోమల నివారణపై ఎంటమాలజీ విభాగం సిబ్బంది మరింత దృష్టి పెట్టాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సూచించారు. ఫిలింనగర్‌లోని బస్తీలు, కాలనీల్లో ఫాగింగ్ నిర్వహించే సిబ్బందితో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దోమలు వ్యాప్తిచెందకుండా ఫాగింగ్ చేయాలని, దోమలు ఎక్కువగా ఉండే బస్తీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యాంటీ లార్వా ఆపరేషన్లను చేపట్టాలని ఆదేశించారు.

## మహిళ అదృశ్యం

బొల్లారం, మే 23: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన చెందిన కడెం ఆశాలత(37) ఓల్డ్ బోయిన్పల్లిలోను తన సోదరుడు కాంబ్లె చంద్రశేఖర్ నివాసానికి వచ్చింది. ఈనెల 19న తమ స్వగ్రామం మహారాష్ట్రలో నాందేడ్‌కు వెళుతున్నాను అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. తన బంధువులకు ఫోన్ చేసి ఆరాతీయగా రాలేదు అని తెలిపారు. సోదరికి ఫోనే చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ మేరకు బంధువులను స్నేహితులను విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### భర్తతో గొడవపడి..

బొల్లారం, మే 23: ఓల్డ్‌బోయిన్పల్లి బృందావనంకాలనీలో ఉంటు న్న పల్లపు అనిత(35) తన ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. నాలుగు నెలల నుంచి తన సోదరి భర్త చెంచయ్య వేరే మహిళతో అక్ర మ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇది గమనించిన తన సోదరి అనిత భర్తతో గొడవపడి ఈ నెల 21న తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సోదరి లక్ష్మిప్రసన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### పౌష్టికాహార కిట్లు పంపిణీ

కొండాపూర్, మే 23 : క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లను శుక్రవారం కొండాపూర్ లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో వ్యాదిగ్రస్తులకు అందజేశారు. దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ చంద్ర కృష్ణ మాట్లాడుతూ.. క్షయకు సంబంధించిన పరీక్షలు, మందులు దవాఖానలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు మెరుగైన పోషక ఆహారాన్ని అందించేందుకు పౌష్టికాహార కిట్లతో పాటు నెలకు రూ. 1000 ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భీములు, స్టాటిస్టికల్ అసిస్టెంట్ సతీశ్, హెల్త్ విజిటర్ సంతోష్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్నలత పాల్గొన్నారు.


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యుడు

# ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడికి వచ్చేలా చూడాలి

## విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా

బండ్లగూడ, మే 23: ఇంటింటికెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించి ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా అన్నా రు. రాజేంద్రనగర్ మండలం పరిధిలోని ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుతూ వస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించినప్పుడే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకొస్తారని అన్నారు. శిక్షణ ముగిసిన వెంటనే బడిబాటలో ఇంటింటికెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను వివరించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. డిజిటల్ విధానంలో భోధన గురించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ డైరెక్టర్ రమేష్, జిల్లా విద్యాధికారి సుసిందర్‌రావు, మండల విద్యాధికారి శంకర్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెన్నెల గద్దర్, చిత్రంలో విమల, సీఎల్ యాదగిరి

ఖైరతాబాద్, మే 23: ఛత్తీస్‌ఘఢ్ అడవుల్లో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు నిర్వహించాలని గద్దర్ సతీమణి గుమ్మడి విమల గద్దర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్‌తో కలిసి విమల గద్దర్ మాట్లాడారు. ఛత్తీస్‌ఘఢ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్ వల్ల అమాయక ఆదివాసీలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్, పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో భారత ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించిందని గుర్తుచేశారు. అదే తరుణంలో ఛత్తీస్‌ఘఢ్‌లోనూ కాల్పులను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా జన జీవన స్రవంతిలోకి తీసుకొచ్చి హింసకు తావులేకుండా చూడాలన్నారు. ఆదివాసీలు శాంతియుతంగా జీవించే పరిస్థితి కల్పించాలని డాక్టర్ వెన్నెల గద్దర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అణగారిన వర్గాల ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు సీఎల్ యాదగిరి, పలువురు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు చైతన్యంలో పార్టీలదే కీలకం

జూబ్లీహిల్స్: ఓటర్లలో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదే కీలక పాత్ర అని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని జీ హెచ్‌ఎం సీ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఓట రు నమోదుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ (ఎం), టీడీపీ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా

## ఎలాహంక రైల్లో ఇద్దరి బంగారు చైన్లు చోరీ

కాచిగూడ, మే 23: ఎలంక రైల్లో దొంగతనాలు జరిగాయి. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన వాణి(49)ఎలంక రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ఇటిక్యాల రైల్వేస్టేషన్ సమీపంలో గల క్రాసింగ్ వద్ద గురువారం అర్ధరాత్రి రైలు స్లో కావడంతో ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు రైలు కిటికీలోంచి వాణి మెడలో ఉన్న 50 గ్రాముల మంగళసూత్రాన్ని గుంజుకొని పారిపోయా రు. బాధితురాలు శుక్రవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు న మోదు చేసుకొని తదుపరి విచారణ నిమి త్తం మహబూబ్ నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

**మరో సంఘటనలో..**

కర్నూల్‌కు చెందిన షేక్ భానుబీ(32) ఎలాహంక రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో క్రాసింగ్ వద్ద రైలు స్లో కావడంతో కిటికీలోంచి ఆమె మెడలో నుంచి మెడలో ఉన్న 10 గ్రాముల బంగారు గొలుసును గుంజుకొని పారిపోయారు. శుక్రవారం భానుబీ కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11 మందికి జైలు శిక్ష

అంబర్‌పేట, మే 23: అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 మందికి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు శిక్ష పడిందని ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్‌రావు తెలిపారు. ఇందులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష పడిందని, మరో పది మందికి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున శిక్ష పడిందన్నారు. వీరంతా రెండోసారి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డారని చెప్పారు. తాగి వాహనాలు నడపొద్దన్నారు.

## మొక్కలు నాటాలి

కాచిగూడ: రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని రైల్వే సీఎంఎస్ డాక్టర్ పద్మ అన్నారు. ఈనెల 22 నుంచి జూన్ 5 వరకు నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కాచిగూడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో సీఎంఎస్ డాక్టర్ పద్మ, రైల్వే అధికారులు మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాలుష్య రహిత ప్రకృతిని అందించేందుకు పచ్చని చెట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.